7

సాక్షి అనకాపల్లి

మంగళవారం । 5 । నవంబర్ । 2024



సకాలంలో పరిష్కారం 8లో

అర్జీలను వెంటనే పరిష్కరించాలని అధికారులను జేసీ జాహ్నవి ఆదేశించారు. కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు 216 అర్జీలు అందాయి.



తొలగింపు కుదరదు 8లో

యలమంచిలి బస్‌కాంప్లెక్స్ వద్ద వైఎస్సార్ విగ్రహ వివాదం నేపథ్యంలో కౌన్సిలర్లు, అధికారులు స్థల పరిశీలన జరిపారు.



మాల్దీవుల బృందం పర్యటన

పెందుర్తి: మాల్దీవుల బృందం సోమవారం ఎస్‌ఆర్ పురంలో పర్యటించి సచివాలయాలను, ఆర్బీకేలను సందర్శించింది.

న్యూస్‌రీల్

నదీ, సముద్ర తీరాల వద్ద భద్రతా ఏర్పాట్లు

- పుణ్యస్నానాలు చేసే చోట గజ ఈతగాళ్లు
- ఆలయాలు, వన భోజనాల వద్ద గస్తీ
- కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు



ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి : కార్తీక మాసం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో జిల్లాలోని సముద్రతీర ప్రాంతాలకు, నదులకు వెళ్లి పుణ్య స్నానాలు ఆచరిస్తారని దానికి అనుగుణంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సముద్రాలు, నదీ తీరప్రాంతాల వద్ద కార్తీకమాసంలో భక్తుల సౌకర్యార్థం గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తమ శాఖ హెచ్చరికలు, సూచనలను పాటిస్తూ క్షేమంగా స్నానాలను ఆచరించాలని భక్తులను ఆయన కోరారు. సోమవారాలు, ప్రధాన రోజుల్లో ఎక్కువ మంది భక్తులు శివాలయాలకు వచ్చే అవకాశం ఉన్నందున పోలీసుస్టేషను పరిధిలోని దేవాలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి చోరీలు జరగకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. కార్తీక వన భోజనాలు నిర్వహించే ప్రాంతాలను ముందుగా గుర్తించి, ఈవ్ టీజింగ్స్, చైన్ స్నాచింగ్స్, ఇతరత్రా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

పెన్సిల్ ముల్లు మీద మూడు తలల సర్పం





నెయ్యిదొండ గోపాల్ పెన్సిల్ ముల్లు మీద చెక్కిన నాగ సర్పం

మాడుగుల రూరల్: నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని సూక్ష్మ కళాకారుడు నెయ్యిదొండ గోపాల్ పెన్సిల్ ముల్లు మీద సర్పాన్ని చెక్కారు. మూడు తలలు ఉన్న నాగసర్పాన్ని పెన్సిల్ ముల్లు మీద చెక్కడానికి మూడు గంటల సమయం పట్టిందని తెలిపారు. ఆయన ఎం.కోడూరు సచివాలయంలో గతంలో గ్రామ వలంటీరుగా పని చేసేవారు. చిన్న చిన్న వస్తువుల మీద సూక్ష్మ కళారూపాలను చెక్కి ప్రశంసలు అందుకున్నారు.

నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్

అనకాపల్లి : గౌడ, ఈడిగ, శెట్టిబలిజ, శ్రీశయన, యాత సామాజిక వర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతినిధి విత్తనాల పోతురాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024లో పదో తరగతి నుంచి పీజీ వరకూ ప్రతిభ కనబర్చిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ ఏడాది స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకునే విద్యార్థులు డిసెంబర్ 7వ తేదీలోపు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు www.kaundinyatrust.orgను సంప్రదించాలన్నారు.

22న కారుణ్య నియామక ప్రత్యేక అదాలత్

తాటిచెట్లపాలెం (విశాఖ): ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో కారుణ్య నియామకాల కోసం ఈ నెల 22వ తేదీన ప్రత్యేక అదాలత్ నిర్వహిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. దొండపర్తిలో గల డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం ప్రాంగణంలో ఆ రోజు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు అదాలత్ జరుగుతుందన్నారు. రైల్వేలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగస్తుల కుటుంబ సభ్యులు దరఖాస్తులను డీఆర్ఎం కార్యాలయంలో ఈ నెల 18వ తేదీలోగా అందజేయాలని సూచించారు.

విశాఖపట్నం-దానాపూర్ మధ్య స్పెషల్ రైలు

తాటిచెట్లపాలెం (విశాఖ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖపట్నం-దానాపూర్-విశాఖపట్నం మధ్య స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం-దానాపూర్(08520) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8వ తేదీ 9.10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11 గంటలకు దానాపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో దానాపూర్-విశాఖపట్నం(08519) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9వ తేదీ శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఆదివారం మధ్యాహ్నం 3.45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

కార్తీక మాసం 'స్పెషల్'

- శబరిమల, పంచారామాలకు ప్రత్యేక బస్సులు

సాక్షి, అనకాపల్లి: కార్తీక మాసంలో ఆధ్యాత్మిక కేంద్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. సాధారణంగా ప్రతి ఏటా పంచారామాలకు వెళ్లే భక్తులు ఎక్కువమంది ఉంటారు. వీరి కోసం ఎప్పట్లాగే ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నారు. శబరిమలకు కూడా స్పెషల్ ప్యాకేజీ ప్రకటించారు. ఈ ఏడాది ఎక్కువ సంఖ్యలో బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఒకరోజులోనే పంచారామాల దర్శనం

కార్తీక మాసంలో ప్రతి ఆదివారం సాయంత్రం 5 గంటలకు అనకాపల్లి, నర్సీపట్నం డిపోల నుంచి బస్సులు బయలుదేరి పంచారామాలైన అమరావతి (అమరేశ్వరుడు), భీమవరం (సోమేశ్వరుడు), పాలకొల్లు (క్షీరరామలింగేశ్వరుడు), ద్రాక్షారామం (భీమేశ్వరుడు), సామర్లకోట (కొమర లింగేశ్వరుడు) పుణ్యక్షేత్రాలను దర్శించుకుని తిరిగి సోమవారం రాత్రి డిపోలకు చేరుకుంటాయి. టికెట్లను ఏపీఎస్ ఆర్టీసీ ఆన్‌లైన్.ఇన్ వెబ్‌సైట్‌లో, లేదంటే డిపో కౌంటర్లలో బుక్ చేసుకోవచ్చు. ప్రత్యేకంగా బస్సును బుక్ చేసుకునే భక్తుల కోసం.. వారు ప్రయాణించే చోటుకే బస్సు పంపే ఏర్పాట్లు చే స్తున్నారు.

ముందుగా బుక్ చేసుకోవచ్చు

కార్తీక మాసంలో ప్రతి ఆదివారం (ఈనెల 3, 10, 17, 24వ తేదీల్లో) అనకాపల్లి, నర్సీపట్నం డిపోల నుంచి పంచరామాల పుణ్యక్షేత్రాలకు బస్సులు బయలుదేరుతున్నాయి. భక్తులు ముందుగానే ఆన్‌లైన్ అఫీషియల్ వెబ్‌సైటులో టికెట్లు బుక్ చేసుకోవచ్చు. లేదంటే అనకాపల్లి డిపోతో 7382913967 నంబరుకు, నర్సీపట్నం డిపోతో 9494811855 నంబరుకు సంప్రదించవచ్చు. శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్పస్వాములు, భక్తుల కోసం ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నాం. డిపో మేనేజర్లను సంప్రదించి శబరిమల స్పెషల్ బస్సులు బుక్ చేసుకోవచ్చు.

– కె.పద్మావతి, ప్రజారవాణా శాఖ జిల్లా అధికారి

చార్జీల వివరాలు

బస్ సర్వీస్	పల్లె వెలుగు	ఎక్స్‌ప్రెస్	అల్ట్రా డీలక్స్	అల్ట్రా పల్లె వెలుగు
అనకాపల్లి-పంచారామాలు	రూ.1100	రూ.1200	రూ.1450	-
నర్సీపట్నం-పంచారామాలు	రూ.900	రూ.1200	రూ.1450	రూ.1080

శివోహం

శివాలయాలు కిటకిటలాడాయి. పంచాక్షరి మార్మోగింది. కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో జిల్లా అంతటా ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది. పంచదార్ల ధారపాలెంలో వెలసిన ఉమా ధర్మలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. ఆలయం వద్ద పుణ్యధారల్లో పవిత్ర స్నానాలు ఆచరించి కొండపైన ఉన్న ఉమాధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి, లలితా సహస్ర లింగేశ్వరస్వామి, ద్విముఖ వినాయకుని ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కొండ కింద ఉన్న రాధామాధవస్వామి ఆలయంలోని పుణ్యధారల వద్ద తోపులాట జరగకుండా రాంబిల్లి పోలీసులు క్యూలైన్‌లో భక్తులను స్నానాలకు పంపించారు. దేవదాయ శాఖ అధికారి సాంబశివరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

-రాంబిల్లి (యలమంచిలి):



పూజలు అందుకుంటున్న కాశీవిశ్వేశ్వరస్వామి



పంచదార్లలోని ఉమాధర్మలింగేశ్వరస్వామి



ఉమా ధర్మలింగేశ్వరస్వామి క్షేత్రంలో పంచదార్ల వద్ద కార్తీక స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

రైల్వే పార్శిల్ కేంద్రం కోసం..

- వైఎస్సార్‌సీపీ ఉద్యమం
- రైల్వే స్టేషన్ వరకు భారీ ర్యాలీ

అనకాపల్లి:

అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో పార్శిల్ కార్యాలయాన్ని రైల్వే ఉన్నతస్థాయి అధికారులు తక్షణమే పునరుద్ధరించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ డిమాండ్ చేశారు. రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రైల్వే స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి స్టేషన్ ఇన్‌చార్జి మేనేజర్ కె.రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మలసాల మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో పార్శిల్ కార్యాలయాన్ని మూసివేయడం వలన వ్యాపారస్తులు, వివిధ వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు పడతారన్నారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ప్రజలు ఈ స్టేషన్ నుంచే ఇతర రాష్ట్రాలకు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు సరకులు, వస్తువులు పంపిస్తుంటారన్నారు. కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కలాసీల కుటుంబాలు ఒక్కసారిగా రోడ్డునపడే పరిస్థితి ఏర్పడుతుందని, వారి పొట్ట కొట్టవద్దని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి ఎంపీ బీవీ సత్యవతి తీసుకువచ్చిన రూ.25 కోట్లతో స్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రస్తుత ఎంపీ స్టేషన్ని మరింత అభివృద్ధి చేసి, పార్శిల్ కార్యాలయం కొనసాగేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా రైల్వే హమాలీలు భరత్‌కుమార్‌కు వారి సమస్యలను విన్నవించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివసత్యనారాయణ (జోసెఫ్), ఎంపీపీ గొర్లి సూరిబాబు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, అనకాపల్లి, కశింకోట పార్టీ మండల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్‌కుమార్, వైస్ ఎంపీపీలు అయితా రాము, పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్‌కు ర్యాలీగా వెళుతున్న మలసాల భరత్‌కుమార్ తదితర నేతలు

పార్శిల్ సేవలు పునఃప్రారంభం

- 'సాక్షి' వార్తకు స్పందించిన రైల్వే అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, అనకాపల్లి: జిల్లా కేంద్రం అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో ఈ నెల ఒకటో తేదీ నుంచి నిలిపివేసిన సరకు రవాణా (గూడ్స్) విభాగం పునఃప్రారంభమైంది. 'సాక్షి' దినపత్రికలో ప్రచురించిన వార్తకు రైల్వే శాఖ స్పందించింది. అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో ఎన్నో ఏళ్లుగా ఉన్న గూడ్స్ బుకింగ్ కౌంటర్‌తోపాటు రవాణా సేవలను మళ్లీ ప్రారంభించింది. సోమవారం వైఎస్సార్‌సీపీ నేతలు కూడా రైల్వే అధికారులకు పార్శిల్ సేవలు కొనసాగించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. దీనికి స్పందించి రైల్వే శాఖ ఉన్నతస్థాయి అధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని స్థానిక రైల్వే అధికారులు చెప్పారు.

ఎగుమతులకు విఘాతం

ఏజెన్సీ ప్రాంతం నుంచి కాఫీ గింజలు, అటవీ ఉత్పత్తులు, అనకాపల్లి, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి బెల్లం వంటి వాటిని అనకాపల్లి రైల్వే స్టేషన్ ద్వారా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. బదిలీ అయిన సిబ్బంది, సామాన్య ప్రజలు తమ ద్విచక్ర వాహనాలు, గృహ వినియోగ వస్తువులను పార్శిల్ బుకింగ్ ద్వారా గమ్యస్థానానికి చేరుస్తుంటారు. ఆకస్మికంగా పార్శిల్ విభాగాన్ని ఎత్తివేస్తున్నట్లు ఈ నెల ఒకటో తేదీన రైల్వే అధికారులు ప్రకటించడంతో ఇక్కడ నుంచి సరకులు ఎగుమతి చేసే వ్యాపారవేత్తలు, దీనిపై ఆధారపడి పనిచేసే హమాలీలు ఆవేదన వ్యక్తం చేశారు. అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు పార్శిల్స్ ద్వారా నెలకు సగటున రూ.2 లక్షల 50 వేల ఆదాయం వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. గతంలో సరుగుడు, బెల్లం వంటి వస్తువుల ఎగుమతులు చాలా ఎక్కువగా జరిగేవని, అప్పట్లో రూ.20 లక్షల ఆదాయం వరకూ వచ్చేదని చెబుతున్నారు. ప్రస్తుతం ఆదాయం తగ్గడంతోనే పార్శిల్ విభాగం ఎత్తివేసే యత్నం చేసి ఉంటారని ప్రజలు భావిస్తున్నారు. అనకాపల్లి స్టేషన్‌లో సరకు రవాణా బుకింగ్ కౌంటర్‌ను ఎత్తివేయడం సరికాదని, సరకు రవాణా విభాగాన్ని కొనసాగించాలని వ్యాపారులు, వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు గత రెండు మూడు రోజుల నుంచి వినతి పత్రాలు అందజేశారు.



అనకాపల్లి రైల్వే స్టేషన్‌లోని పార్శిల్ విభాగం

ఎరక్కపోయి వచ్చారు.. ఇరుక్కుపోయారు..



మాట్లాడుతున్న డీఎస్పీ మోహన్, తహసీల్దార్ రామారావు, ఏడీ శివాజీ, టౌన్, రూరల్ సీఐలు

- గబ్బాడ ఇసుక అంశంపై అధికారుల పొంతనలేని సమాధానాలు
- వైఎస్సార్‌సీపీ నేతలు అడ్డుకోలేదని, తామే వెనక్కి పంపించామని చెప్పే యత్నం
- 40 టన్నుల లారీలను ఎలా అనుమతించారన్న ప్రశ్నకు జవాబు శూన్యం

నర్సీపట్నం: గబ్బాడ డిపోలో ఇసుక అక్రమ రవాణా జరగలేదని.. కావాలనే రాజకీయ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని చెప్పాలనుకున్న అధికారులు.. విలేకరులు అడిగిన ప్రశ్నలకు నీళ్లు నమిలారు. ఇసుక విషయంలో సీఐ వైఖరికి నిరసనగా ఈనెల 6న స్టేషన్ ముందు ధర్నాకు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పిలుపునిచ్చారు. దీంతో హడావుడిగా డీఎస్పీ కార్యాలయంలో ఇసుక అంశంపై సోమవారం డీఎస్పీ మోహన్, తహసీల్దార్ రామారావు, మైనింగ్ ఏడీ శివాజీ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఇసుకను అక్రమంగా తరలించేందుకు లారీల్లో ఇసుక లోడ్ చేస్తుంటే పట్టుకున్నామని వైఎస్సార్‌సీపీ నాయకులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని.. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సమయం మించిపోయినందున లోడ్ చేసిన నాలుగు, ఐదు బకెట్ల ఇసుకను అన్‌లోడ్ చేసి లారీలను బయటకు పంపించేయమని సిబ్బందిని ఆదేశించారని డీఎస్పీ మోహన్ చెప్పుకొచ్చారు. ఎవరో వచ్చి ఆపారనడంలో వాస్తవం లేదని, తానే ఆపానంటూ తహసీల్దార్ రామారావు చెప్పుకొన్నారు. ఇసుక తీసుకువెళ్లేందుకు డిపోకు వచ్చిన రెండు లారీలకు ఆన్‌లైన్ బుకింగ్ కానీ డైరెక్ట్ బుకింగ్ గానీ జరిగి ఉంటే రశీదులు బయట పెట్టాలని విలేకరులు ప్రశ్నించడంతో అధికారుల నుంచి సమాధానం లేదు. 20 టన్నులకు మించిన వాహనాలను అనుమతించబోమని మైనింగ్ ఏడీ చెబుతున్నారని, 40 టన్నుల సామర్థ్యం కలిగిన లారీలను ఎందుకు డిపోలోకి అనుమతించారని విలేకరులు ప్రశ్నల వర్షం కురిపించారు. బుకింగ్ లేని లారీల్లో ఇసుక లోడ్ చేసిన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారా, ఇసుక తరలించేందుకు వచ్చిన లారీ యజమానులపై పోలీసులకు ఫిర్యాదు చేశారా.. అని విలేకరులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పలేక ముఖాలు వెళ్లబెట్టారు. తహసీల్దార్ స్పందించి ఉండకపోతే ఇసుక తరలించుకుపోవటం వాస్తవమా కాదా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఇసుక తీసుకువెళ్లే ప్రయత్నమైతే జరిగిందని తహసీల్దార్ ఒప్పుకున్నారు. ఇసుక రగడపై ఏదో చెప్పాలనుకున్న పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు పొంతన లేని సమాధానాలతో ఎరక్కపోయి.. ఇరుక్కుపోయారు.

ధర్నాకు అనుమతి లేదు: డీఎస్పీ

ఇసుక అంశానికి సంబంధించి సీఐ రేవతమ్మ పారదర్శకంగా వ్యవహరించారని డీఎస్పీ మోహన్ చెప్పారు. విధులకు ఆటంకం కలిగించారని డిపోలో విధులు నిర్వర్తిస్తున్న రెవెన్యూ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు పెట్టారన్నారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఇచ్చిన ఫిర్యాదు, టీడీపీ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు ఇచ్చిన ఫిర్యాదులు న్యాయ పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే చేపడుతున్న శాంతియుత ధర్నాకు పోలీసు అనుమతి లేదన్నారు. ముందస్తు అరెస్టు చేస్తారా అని విలేకరులు ప్రస్తావించగా పోలీసు హెచ్చరికలను బేఖాతరు చేస్తే ముందస్తు అరెస్టులు ఉంటాయని డీఎస్పీ మోహన్ స్పష్టం చేశారు.



సిద్ధంగా ఉన్న రంగురంగుల బోట్లు

కంబాలకొండలో బోటింగ్

ఆరిలోవ: కంబాలకొండలో బోటింగ్ అందుబాటులోకి వచ్చింది. వేసవి ఎండలకు ఇక్కడి కొలనులో నీరు ఎండిపోయింది. దీంతో సుమారు నాలుగు నెలలు పాటు బోటింగ్ నిలిచిపోయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండల నుంచి వచ్చిన వరద నీటితో కొలను నిండింది. దీంతో నిర్వాహకులు మళ్లీ బోటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. సాధారణంగా కార్తీక మాసం వచ్చిందంటే పిక్నిక్ ప్రియులకు కంబాలకొండ గుర్తుకు వస్తుంది. ఇప్పుడు సందర్శకులకు బోటింగ్ మరింత ఉల్లాసాన్ని పెంచనుంది. ప్రస్తుతం 12 కయాకింగ్ బోట్లు, 3 ఫ్యామిలీ బోట్లు(పెద్దవి), 2 రౌండ్ బోట్లు ఉన్నాయి. కయాక్స్ బోటులో ఇద్దరు, ఫ్యామిలీ బోటు, రౌండ్ బోటులో నలుగురు నుంచి ఐదుగురు వెళ్లవచ్చు. ఈ బోట్లలో సుమారు అరగంట సమయం కొలను అంతా చుట్టి రావచ్చు. దీనికి రూ.200 టిక్కెట్ రుసుముగా చెల్లించాలి.

ఆర్మీ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

- జమ్మూకశ్మీర్ శ్రీనగర్‌లో గుండెపోటుతో మృతి
- రాంబిల్లి మండలం దిమిలి గ్రామంలో విషాదం
- సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు

రాంబిల్లి (యలమంచిలి): దేశ రక్షణ రంగంలో జమ్మూ కశ్మీర్ శ్రీనగర్ సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తూ గుండెపోటుతో మృతి చెందిన వీర జవాన్ హవల్దారు గంగిరెడ్ల శివశంకరరావు అంత్యక్రియలు గ్రామస్తులు, బంధువులు, తోటి ఆర్మీ అధికారుల అశ్రునయనాల మధ్య సోమవారం దిమిలి గ్రామంలో సైనిక లాంఛనాలతో ఘనంగా జరిగాయి. దిమిలి గ్రామానికి చెందిన గంగిరెడ్ల శివశంకరరావు ఈ నెల 1వ తేదీ శుక్రవారం తెల్లవారుజామున జమ్మూకశ్మీర్ శ్రీనగర్ వద్ద ఆర్మీ యూనిట్‌లో విధులు నిర్వర్తిస్తుండగా ఆకస్మికంగా గుండెపోటుకు గురై మృతి చెందారు. జవాను భౌతికకాయాన్ని సోమవారం ఉదయం స్వగ్రామం దిమిలి తీసుకువచ్చారు. భౌతిక కాయం ఉంచిన అంతిమయాత్ర రథాన్ని అచ్యుతాపురం ప్రధాన రహదారి గుండా వెంకటాపురం మీదుగా దిమిలి గ్రామానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. గ్రామస్తులు, బంధువులు దారిపొడవునా పూలు చల్లుకుంటూ సుమారు 15 కిలోమీటర్ల వరకు ద్విచక్రవాహనాలతో జవాను అంతిమయాత్రలో పాల్గొన్నారు. అనంతరం శివశంకర్ భౌతికకాయం వద్ద ఆర్మీ అధికారులు, నేవీ సిబ్బంది జాతీయ పతాకం ఉంచి, భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేసి ఘన నివాళులర్పించారు. శివశంకర్ చివరిసారిగా ధరించిన యూనిఫాం, జాతీయపతాకాన్ని భార్య కృష్ణవేణి (లక్ష్మి), తల్లిదండ్రులకు ఆర్మీ అధికారులు అందజేశారు. అనంతరం ఆర్మీ అధికారులు, సుబేదార్ సుజన్‌సింగ్, ఆనంద్‌సింగ్, ఎస్.ఎస్.రాజ్‌కుమార్, జి.యోగానంద్ ఆధ్వర్యంలో నేవీ అధికారులు పరేడ్ నిర్వహించి గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి ఘనంగా సైనికలాంఛనాలతో అంత్యక్రియలు జరిపించారు. మృతిచెందిన జవాన్ శివశంకర్‌కు భార్య కృష్ణవేణి, కుమార్తెలు జగదీశ్వరి, దివ్య, కుమారుడు యశ్వంత్, తండ్రి సన్యాసినాయుడు, తల్లి వరహాలు ఉన్నారు. ఆర్మీలో చేరి 23 సంవత్సరాలు గడిచి మరో ఏడాది సంవత్సరంలో హవల్దారుగా పదవీ విరమణ చేయాల్సి ఉన్న దశలో శివశంకర్ ఆకస్మిక మృతి గ్రామస్తులను విషాదంలో ముంచింది. దసరా పండగకు స్వగ్రామం వచ్చి కుటుంబం, స్నేహితులతో ఆనందంగా గడిపి మేనకోడలి పెళ్లిని దగ్గర ఉండి జరిపించి మరలా విధులకు వెళ్లి రెండు వారాలు గడవక ముందే విగత జీవిగా తిరిగి రావడాన్ని జీర్ణించుకోలేపోతున్నారు. వేలాది మంది ప్రజల అశ్రునయనాల మధ్య జవాన్ శివశంకర్ అంత్యక్రియలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో రాంబిల్లి మండల వైస్ ఎంపీపీ కొట్టాపు శ్రీలక్ష్మి , మాజీ సైనికోద్యోగి వడ్డీ కాసులు, తూర్పు కాపు సంక్షేమ సంఘం నాయకులు, న్యాయవాది కరణం శ్రీహరి, గ్రామ పెద్దలు, మాజీ ఆర్మీ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఆర్మీ జవాన్ శివశంకర్ కడసారి ధరించిన ఆర్మీ దుస్తులను భార్య,కుటుంబ సభ్యులకు అందిస్తున్న ఆర్మీ అధికారులు



ఆర్మీ జవాన్ శివశంకర్ మృతదేహం వద్ద గాల్లోకి కాల్పులు జరుపుతున్న నేవీ సిబ్బంది, (ఇన్‌సెట్) శివశంకర్ (ఫైల్)

క్లుప్తంగా

మా దారి.. అడ్డదారి

- అధికారం అడ్డుపెట్టుకుని ఏజెన్సీలు మార్చే ప్రయత్నం
- మధ్యాహ్న భోజనం పెట్టకుండా అడ్డుకున్న టీడీపీ నేతలు

కోటవురట్ల: కూటమి ప్రభుత్వం వచ్చీ రావడంతోనే ఆ పార్టీల కార్యకర్తలు దోపిడీ మార్గాలు వెతుకుతున్నారు. అక్రమంగా దోచుకునే మార్గాలను వేటినీ వదిలిపెట్టడంలేదు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ ఏజెన్సీలపై ఇప్పుడు వారి కన్ను పడింది. అడ్డగోలుగా పాత ఏజెన్సీలను మార్చేసి తమ వర్గీయులకు కట్టబట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వాస్తవానికి మధ్యాహ్న భోజనం పథకంలో వంటకాలు బాగుండకపోయినా, మెనూ అమలు చేయకపోయినా, నాణ్యత కొరవడినా ఆ ఏజెన్సీలపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కానీ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెడుతున్నప్పటికీ టీడీపీ నాయకులు తమకు అనుకూలమైన వారికి ఏజెన్సీలు కట్టబెట్టేందుకు మొండిగా ముందుకెళుతున్నారు. తాజాగా సోమవారం కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలోని ఎంపీపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ మార్చాలని టీడీపీ నాయకులు ఒత్తిడి తెచ్చారు. అంతటితో ఆగకుండా మధ్యాహ్న భోజనం పిల్లలకు పెట్టకుండా అడ్డుపడ్డారు. పావుగంట సేపు భోజనం పెట్టకుండా అడ్డుపడడంతో విషయం తెలుసుకున్న ఇద్దరు ఎంఈవోలు రామారావు, శ్రీజోష్ అక్కడకు చేరుకుని టీడీపీ నాయకులకు సర్ది చెప్పారు. ఎస్‌ఎంసీ సభ్యులతో పాటు మండల కమిటీలో తీర్మానం ప్రవేశపెట్టి ఏజెన్సీని మారుస్తామని హామీ ఇవ్వడంతో అప్పుడు పిల్లలకు భోజనం పెట్టారు. పాఠశాలల్లో కూడా రాజకీయం చేసి పిల్లల కడుపులు మాడ్చేస్తున్నారని, కూటమి ప్రభుత్వానికి ఇది తగదని పలువురు విమర్శిస్తున్నారు.

వెంకటాపురంలో ముందే నాగుల చవితి



వెంకటాపురంలో పుట్ట వద్ద బాణసంచా వెలిగిస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని వెంకటాపురంలో నాగులచవితి వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ గ్రామంలో రాత్రిపూట నాగులచవితి వేడుకలు జరుపుకోవడం పూర్వీకుల నుంచి వస్తున్న ఆనవాయితీ. కుటుంబ సభ్యులంతా ఉత్సాహంగా ఊరేగింపుగా పుట్టల వద్దకు తరలివెళ్లారు. ఆకాశంలో చుక్కను చూసి పుట్టలో పాలు, చిమిడి పోశారు. పుట్టల వద్ద బాణసంచా వెలిగించి సందడి చేశారు.

సకాలంలో అర్జీల పరిష్కారం

- అధికారులకు జేసీ జాహ్నవి ఆదేశం
- కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు 216 అర్జీలు



అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు సమస్యను జేసీ జాహ్నవికి వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

తుమ్మపాల: అర్జీలపై సంబంధిత అధికారులు సకాలంలో స్పందించి పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించరాఉ. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమెతో పాటు జిల్లా అధికారులు అర్జీలు స్వీకరించి, సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజల తెలియజేస్తున్న సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి అవకాశం ఉన్న వాటికి తక్షణం పరిష్కారం చూపాలన్నారు. పరిష్కారం చేసేందుకు అవకాశం లేని సమస్యలపై అర్జీదారుకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలన్నారు. అర్జీలు ఎట్టి పరిస్థితిలోనూ రీఓపెన్ కాకూడదన్నారు. మొత్తం 216 అర్జీలు నమోదు కాగా.. రెవెన్యూ శాఖ 126, పంచాయతీ రాజ్ 11, సర్వే సెటిల్‌మెంట్ 10, పోలీస్ 8, ఏపీఐఐసీ 7, మున్సిపాలిటీ 5, రూరల్ డెవలప్‌మెంట్, ప్రొహిబిషన్, ఎక్సైజ్, రోడ్లు భవనాలు, ఫారెస్ట్, గ్రామీణ పేదరికంపై 4 చొప్పున, ఇతర శాఖలపై మరికొన్ని అర్జీలు అందాయి.

భారీ వాహనాల రాకపోకలు నియంత్రించాలి

అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డులో మితిమీరిన వేగం, పరిమితికి మించి లోడుతో ప్రయాణిస్తున్న భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో జేసీకి ఆయన ఆయా గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీలతో కలిసి వినతి పత్రం అందజేశారు. రోడ్డు అధ్వానంగా తయారు కావడంతో ఫార్మాసిటీ పరిశ్రమలకు రాకపోకలు సాగించే ఉద్యోగులతో పాటు పూడిమడక, రాంబిల్లి, తదితర గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని బొడ్డేడ చెప్పారు. భారీ వాహనాల రాకపోకలు కారణంగా బ్రిటిష్ కాలం నాటి వంతెనలు శిథిలావస్థకు చేరాయన్నారు. 100 అడుగల రోడ్డు విస్తరణ అంటూ ప్రకటనలే తప్ప పనులు కనిపించడం లేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఎం.సూర్యనారాయణ, ఎస్.నీలకంఠం, బి.శ్రీనివాసరావు, కె.జగన్నాథం, ఎ.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సోదరుల దాడిపై ఫిర్యాదు

తన కష్టార్జితంతో కొనుక్కున్న భూమిని పంచలేదని తన సోదరులు దాడి చేశారని కశింకోట మండలం నరసాపురం గ్రామానికి చెందిన టి.దేముళ్లు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. తన వివాహ అనంతరం కూలీ పనులు చేసుకుంటూ దాచుకున్న నగదుతో గ్రామంలో 40 సెంట్ల వ్యవసాయ భూమి కొన్నానని, చెరకు సాగు చేసుకుంటున్నానని, ఇటీవల తన సోదరులు వచ్చి ఆ భూమి కూడా పంచాలని ఘర్షణకు దిగారన్నారు. తనను రక్షించాలని అధికారులను ఆయన వేడుకున్నారు.

దొంగ మస్టర్లతో నిధుల స్వాహా

ఉపాధి హామీ పథకం కూలీల పేరుతో దొంగ మస్టర్లు వేసి ప్రభుత్వ నిధులు స్వాహా చేసిన ఈఆర్పీ ఆదిలక్ష్మి అవినీతిపై విచారణ చేసి చర్యలు తీసుకోవడంతో పాటు తొలగించాలని యలమంచిలి మండలం పులపర్తి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో చేపట్టిన ఉపాధి పనుల్లో భారీగా నిధులు కాజేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.



నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

దివ్యాంగుల ఆందోళన

దివ్యాంగుల హక్కుల చట్టం-2016ను పటిష్టంగా అమలు చేయాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. అనంతరం డీఎల్‌డీవో మంజులవాణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరు యాదవ్ మాట్లాడుతూ దివ్యాంగుల హక్కులపై ఐక్యరాజ్య సమితి, సుప్రీం కోర్టు సూచనలు పాటించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో ర్యాంపులు, కనీస సౌకర్యాలు లేక జిల్లాలో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి మొల్లి చంద్రశేఖర్, శరగడం నాగభూషణం, కసిరెడ్డి అర్జున్, భానోద్ దిలీప్, శెంద్రీ శశికళ పాల్గొన్నారు.

సాగునీటి కాలువల్లో పూడికతీతకు వినతి

ఆక్రమణకు గురైన చెరువుకు సర్వే చేసి గట్లు పటిష్టం చేయాలని, చెరువులో నీరు పంటలకు సరఫరా అయ్యేలా కాలువల్లో పూడిక తీత చేపట్టాలని కోరుతూ కశింకోట మండలం బయ్యవరం గ్రామస్తులు జేసీకి వినతి పత్రం అందజేశారు. సర్వే నంబర్ 222/1, 2, 223 మొత్తం 6.50 ఎకరాల చెరువు ప్రస్తుతం 3 ఎకరాలు మాత్రమే ఉందని, సర్వే చేసి హద్దుల ఆధారంగా గట్టు వేయాలని కోరారు.

దీనిపై ఫిర్యాదు చేస్తే అధికారులు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని గ్రామస్తులు తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు.

సమస్యలపై వీఆర్‌ఏల నిరసన



సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన చేస్తున్న వీఆర్‌ఏలు

నిబంధనలకు విరుద్ధంగా వీఆర్‌ఏలను ప్రభుత్వ కార్యాలయాల వద్ద నైట్ వాచ్‌మెన్ల మాదిరి వినియోగించుకుంటూ ఇబ్బందులు పెడుతున్నారంటూ రాష్ట్ర గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద వీఆర్‌ఏలు నిరసన కార్యక్రమం చేపట్టారు. తెలంగాణా ప్రభుత్వం మాదిరి వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, జిల్లాలో ఖాళీగా ఉన్న వీఆర్వోలు, అటెండర్, వాచ్‌మన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ వంటి పోస్టుల్లో తమను భర్తీ చేసి న్యాయం చేయాలన్నారు. ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వీఆర్‌ఏలను వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. వీఆర్‌ఏల జీతాలు రూ.15 వేలు చేస్తామని ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రవికుమార్, కార్యదర్శి ఎస్.గంగాధరరావు, ఆయా మండలాల సంఘం అధ్యక్షులు, జిల్లాలో వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 30 అర్జీలు



అర్జీదారుల సమస్యలు వింటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్)కు 30 అర్జీలు వచ్చాయని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. అర్జీదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటూ ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్, ఇతర సమస్యలపై ఎక్కువగా అర్జీలు అందాయన్నారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహం తొలగింపు కుదరదు

- సంయుక్త పరిశీలనలో స్పష్టం చేసిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు



అధికారులతో చర్చిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

యలమంచిలి రూరల్: పట్టణంలో బస్‌కాంప్లెక్స్ వద్ద దివంగత మహానేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహంపై అధికార కూటమి పార్టీ నాయకుల అసూయ, అక్కసు రోజురోజుకూ పెరిగిపోతోంది. వైఎస్సార్ విగ్రహం బస్సుల రాకపోకలకు అడ్డుగా ఉందంటూ నెలరోజుల క్రితం కూటమి నాయకులు స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు ఇచ్చారు. ఈ మేరకు అప్పట్లో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు మంచి ఉద్దేశ్యంతో వైఎస్సార్ విగ్రహం చుట్టూ ఉన్న గట్టును కొంత మేర తొలగించేందుకు అంగీకరించారు. అయినప్పటికీ అది చాలదంటూ విగ్రహం అడ్డుగా ఉండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయంటూ కూటమి నేతలు అసత్య ప్రచారాన్ని మొదలుపెట్టారు. ఈ మేరకు సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలను మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్లు, మూడు శాఖల అధికారులు పరిశీలించారు. బస్ కాంప్లెక్సులోకి రాకపోకలు సాగించే బస్సులకు ఇన్, అవుట్ గేట్ల వద్ద ఉన్న ఆక్రమణలు, అదేవిధంగా అనుమతులు లేకుండా ఆర్టీసీ అధికారులు నిర్మించిన దుకాణ సముదాయం తొలగిస్తే బస్సుల రాకపోకలు సాఫీగా జరుగుతాయని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు అధికారులకు తేల్చి చెప్పారు. ఎన్నో ఆక్రమణలు ఉండగా అవన్నీ వదిలి వైఎస్సార్ విగ్రహంపై అసత్య ప్రచారానికి దిగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విగ్రహం వల్ల ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. రాజకీయ పక్షపాతం, అక్కసుతోనే వైఎస్సార్ విగ్రహం తొలగించాలని చూస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్‌లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వర్రావు, వార్డు కౌన్సిలర్లు దూది నర్శింహమూర్తి, రాపేటి సంతోష్, సుంకర మరిణేశ్వర్రావు అభిప్రాయపడ్డారు. వారం రోజుల్లో ఆక్రమణలు, ట్రాఫిక్ ఐలాండ్ ఎంత ఉండాలి వంటి అంశాలపై వివరాలు తయారు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి అధికారులను కోరారు. పెరుగుతున్న పట్టణ జనాభా అవసరాల దృష్ట్యా పట్టణానికి దూరంగా మరోచోట బస్‌కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తే ఇంకా మంచిదని ఆ దిశగా ఆలోచన చేయాలని ఆమె అధికారులకు సూచించారు. వైఎస్సార్ విగ్రహంపై వివాదం నేపథ్యంలో పాలకవర్గ సమావేశంలో విగ్రహం తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేస్తే బాగుంటుందని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు రమాకుమారికి చెప్పారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ, వివిధ విభాగాలకు చెందిన మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ముందు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడండి

- కొత్త స్టీల్‌ప్లాంట్ సంగతి తర్వాత చూద్దాం
- కూటమి నేతలకు వైఎస్సార్‌సీపీ హితవు



నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతున్న వీసం, తదితర నేతలు

నక్కపల్లి: ఉట్టికెగరలేనమ్మ.. స్వర్గానికి ఎగిరందన్నట్టు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడలేని చంద్రబాబు నక్కపల్లి మండలంలో ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో మరో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయిస్తామని ప్రకటన చేయడం సిగ్గు చేటని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ దుయ్యబట్టారు. సోమవారం ఆయన నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల ముందు కూటమి పార్టీలకు ఓటేస్తే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం కాకుండా కాపాడతామని మోసపూరిత హామీలు ఇచ్చి ఓట్లేయించుకున్నారన్నారు. ప్రజలంతా నమ్మి అధికారం కట్టబెడితే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయడం లేదని కేంద్రంతో ప్రకటన ఇప్పించలేకపోయారన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, రాష్ట్ర బీజేపీ నేతల సంపూర్ణ సహకారంతోనే కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయడానికి నిర్ణయం తీసుకుందన్నారు. కూటమి నేతలకు దమ్ము, సత్తా ఉంటే విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటుపరం కాదు, ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగుతుందని ప్రకటన చేయించాలన్నారు. విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ సేకరించిన భూములకు సంబంధించి చాలా మంది నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల ప్రక్రియ పెండింగ్‌లో ఉందన్నారు. వారి సమస్యలు పరిష్కరించకుండా స్టీల్‌ప్లాంట్ లేదా ఏ ఇతర కంపెనీల కోసమైనా భూములు సేకరించే ప్రక్రియ మొదలు పెడితే అడ్డుకుంటామన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పొడగట్ల పాపారావు, సర్పంచ్ తల్ల భార్గవ్, వెంకటేష్, ఎంపీటీసీ సభ్యులు తిరుపతిరావు, గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఈవో దృష్టికి ఉపమాక ఆలయ సమస్యలు

- హోం మంత్రి అనిత వెల్లడి



టీటీడీ ఈవో శ్యామలరావుకు సమస్యలు వివరిస్తున్న మంత్రి అనిత

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం, టీటీడీ అనుబంధ దేవాలయం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై టీటీడీ ఈవో శ్యామలరావుతో చర్చించినట్టు హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ 2015లో ఆలయాన్ని టీటీడీ స్వాధీనం చేసుకునే సమయంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తామని హామీలు ఇచ్చారన్నారు. కొండపైకి ఘాట్‌రోడ్డు, నక్కపల్లి నుంచి ఉపమాక వరకు 80 అడుగుల రోడ్డుగా విస్తరణ, కాటేజీలు నిర్మాణం, వాహనాల పార్కింగ్, కల్యాణ మండపాల నిర్మాణం, మెట్ల మార్గంలో ప్రత్యేక సదుపాయాలు, బాలాలయ నిర్మాణం, స్వామివారి ముఖ పండపం, స్వామివారి మూలవిరాట్ ఉన్న ఆలయాన్ని ఆధునికీకరించడం, గరుడాద్రి పర్వతం వద్ద వైజంక్షన్‌లో రాజగోపురం నిర్మాణం, శ్రీవారి పోటు అభివృద్ధి, కల్యాణ మండపం, గోశాల నిర్మాణం తదితర హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ఒకటో రెండో మినహా పెద్దగా అభివృద్ధి జరగలేదన్నారు. ఇచ్చిన హామీలు, సమస్యలను సోమవారం విజయవాడలో టీటీడీ ఈవో శ్యామలరావు దృష్టికి తీసుకెళ్లినట్టు మంత్రి తెలిపారు. తక్షణమే ఉన్నతాధికారులను పంపించి ఉపమాక ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్యలు తీసుకుంటామని ఈవో హామీ ఇచ్చినట్లు ఆమె చెప్పారు.

పంచరాత్రి ఉత్సవాలకు భారీ బందోబస్తు

- జాతర ప్రాంతాలను పరిశీలించిన ఎస్పీ తుహిన్ సిన్హా
- నేటి ఉదయం 11 గంటల నుంచి ట్రాఫిక్ మళ్లింపు



పంచరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

యలమంచిలి రూరల్: పంచరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం జరిగే జాతరకు జిల్లా నలుమూలల నుంచి లక్షన్నర మందికి పైగా భక్తులు తరలివస్తారన్న అంచనాతో పోలీసు అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఉత్సవాలు నిర్వహిస్తున్న ప్రాంతాలను ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం రాత్రి పరిశీలించారు. ఉత్సవ కమిటీల సభ్యులతో ఏయే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. మొత్తం 8 స్టేజీ ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నట్టు వారు ఎస్పీకి తెలిపారు. వేదికలను ఎక్కడెక్కడ ఏర్పాటు చేస్తున్నారో ఆయన స్వయంగా చూశారు. స్టేజీ ప్రోగ్రాంలు రాత్రి 10.30 గంటలకల్లా పూర్తయ్యేలా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నా ఉత్సవ కమిటీలదే బాధ్యత అని ఎస్పీ స్పష్టం చేశారు. వీవీఐపీలు రావడానికి వీలుగా అంతర్గత రహదారులకు ఇరువైపులా వేసిన కర్రలు తొలగించాలని చెప్పారు. అనంతరం భూలోకమాంబ అమ్మవారిని ఎస్పీ దర్శించుకున్నారు.

వాహనాల మళ్లింపు.. సీసీ కెమెరాలతో నిఘా

మంగళవారం ఉదయం 11 గంటల నుంచి ప్రధాన రహదారి మీదుగా భారీ వాహనాల రాకపోకలను అనుమతించేది లేదని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి పట్టణానికి నలువైపుల నుంచి ద్విచక్ర వాహనాల రాకపోకలను నిలిపివేస్తామన్నారు. సోమవారం రాత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయన మీడియా సమావేశంలో జాతరకు సంబంధించి పోలీసు శాఖ తరపున తీసుకుంటున్న బందోబస్తు చర్యలను వివరించారు. అనకాపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలకు బోదెపు గోవింద్ పెట్రోల్ బంక్ వద్ద ఉన్న చెరకు కాటా స్థలంలో, శ్రీచైతన్య స్కూల్ ఫ్లై ఓవర్ వద్ద, తుని వైపు నుంచి వచ్చే వాహనాలకు విజయలక్ష్మి పెట్రోల్ బంక్ వద్ద ఖాళీ స్థలంలో, అచ్యుతాపురం వైపు నుంచి వచ్చే వాహనాలను కల్కి పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న పెంకుల ఫ్యాక్టరీ స్థలంలో, ఎస్.రాయవరం వైపు నుంచి వచ్చే వాహనాలకు రామచంద్రమ్మ గుడి వద్ద పార్కింగ్ స్థలాలను కేటాయించామన్నారు. ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రజా రవాణా వాహనాలను రేగుపాలెం హైవే కూడలి మీదుగా మళ్లిస్తున్నామని చెప్పారు. ఒక డీఎస్పీ, ఐదుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలు, 50 మంది ఏఎస్ఐలతో పాటు ఏఎన్ఎస్, క్రైమ్ పార్టీలు అదనంగా బందోబస్తులో భాగస్వామ్యం అవుతారన్నారు. సీసీ కెమెరాలతో నిఘా ఉంచుతున్నామన్నారు. అనంతరం సర్కిల్ పరిధిలో పోలీసు అధికారులతో బందోబస్తు ఏర్పాట్లపై డీఎస్పీ సమీక్ష జరిపారు. యలమంచిలి సీఐ ధనుంజయరావు, పట్టణ, రూరల్, ట్రాఫిక్ ఎస్ఐలు సావిత్రి, ఉపేంద్ర, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సుందరపు వర్సెస్ కమ్యూనిస్ట్ నేతలు

అచ్యుతాపురం: యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, కమ్యూనిస్ట్ నేతల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఎమ్మెల్యే వైఖరి సరిగ్గా లేదని రైతు సంఘం నేతలు మీడియాకు ప్రకటన విడుదల చేయగా, తన వద్దకు వచ్చిన కమ్యూనిస్టు నేతలు అబద్ధాలు చెబుతున్నారని ఎమ్మెల్యే కౌంటర్ ఇవ్వడం వివాదాస్పదంగా మారింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఇటీవల డెయిరీ పాడి రైతులకు చెల్లించే ధరను లీటరుకు రూ.3 తగ్గించింది. దీనిపై డెయిరీ వద్ద ఆందోళన చేసిన నేతలకు డెయిరీ తరపున సరైన సమాధానం రాలేదు. డెయిరీ పాలక మండలి సమావేశం నిర్వహించిన తర్వాత రైతులకు చెల్లించే ధర విషయంపై స్పష్టత ఇస్తామని డెయిరీ ప్రతినిధులు చెప్పడంతో రైతు సంఘాల నేతలు ఎంపీ, ఎమ్మెల్యేల మద్దతు కోసం ప్రయత్నించారు. ఈ క్రమంలోనే యలమంచిలి ఎమ్మెల్యే సుందరపును రైతు సంఘం నేత కర్రి అప్పారావు నేతృత్వంలోని పలువురు ఇటీవల కలిశారు. ఈ సందర్భంగా మొదలైన చర్చ అభిజిత్ పరిశ్రమ వైపు మళ్లిందని, తమను దుర్భాషలాడిన ఎమ్మెల్యే వైఖరి సరికాదని అప్పారావు మీడియాకు వెల్లడించారు. రైతుల అంశంపై మట్లాడకుండా అభిజిత్ అంశాన్ని తెరపైకి తెచ్చి కమ్యూనిస్టు నేతల్ని నిందించారని ఆయన పేర్కొన్నారు. తమను దొంగ కమ్యూనిస్టులుగా చిత్రీకరిస్తూ విజయ్‌కుమార్ మాట్లాడారని అప్పారావు ఆరోపించారు. అయితే కమ్యూనిస్టులంటే తమకు గౌరవం ఉందని, తన వద్దకు వచ్చిన కమ్యూనిస్టులు కావాలని అబద్ధం చెబుతున్నారని ఎమ్మెల్యే చెబుతున్నారు. సాక్షితో ఆయన మాట్లాడుతూ పాల డెయిరీని అభిజిత్ పరిశ్రమలా మారుస్తారా..?అన్నట్టుగా మాట్లాడటంతో తాను సమాధానం చెప్పానే తప్ప కమ్యూనిస్టులను అవమానించలేదని వివరణ ఇచ్చారు.

ఖోఖో చాంపియన్ విశాఖ జట్లు



ప్రథమ స్థానం సాధించిన విశాఖ బాలుర జట్టు



ప్రథమ స్థానం సాధించిన విశాఖ బాలికల జట్టు

అనకాపల్లి: తుమ్మపాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాల, బాలికల ఖోఖో పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. రాష్ట్రంలో మొత్తం 26 జిల్లా నుంచి 44 టీమ్‌లు పాల్గొన్నాయి. ఫైనల్స్ బాలుర విభాగంలో విశాఖ-ప్రకాశం జిల్లాల మధ్య జరిగిన పోటీలో విశాఖ జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించగా, బాలికల విభాగంలో విశాఖ-నెల్లూరు జిల్లాల మధ్య జరగగా.. విశాఖ బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో నలుగురికి పతకాలు



వుషూ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులతో అరుణ, హరీష్

అనకాపల్లి: శ్రీకాకుళంలో ఈ నెల 3న 68వ ఇంటర్ జిల్లాల స్కూల్ గేమ్స్ వుషూ చాంయియన్‌షిప్-2024 పోటీల్లో అనకాపల్లి మండలం తారక రామారావు కాలనీ ఫిట్‌నెస్ అండ్ బాక్సింగ్ క్లబ్‌కు చెందిన నలుగురు విద్యార్థులు పతకాలు సాధించారని బాక్సింగ్ శిక్షకులు కోరుకొండ అరుణ, హరీష్ సోమవారం తెలిపారు. అండర్-17 కేటగిరీలో 40 కేజీల విభాగంలో ఎస్.తులసీరామ్ బంగారు పతకం, కె.యువరాజ్ 60 కేజీల విభాగంలో బంగారు పతకం, ఈ.లక్ష్మి 48 కేజీల విభాగంలో రజత పతకం, వై.వినయ్ 56 కేజీల విభాగంలో కాంస్యం పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విజేతలను పలువురు అభినందించారు.

డ్వాక్రా సభ్యుల వివరాలు నవీకరించాలి

యలమంచిలి రూరల్: జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యుల వివరాలన్నింటినీ ప్రొఫైలింగ్ యాప్‌లో నమోదు చేయాలని మెప్మా పీడీ సరోజిని చెప్పారు. సోమవారం యలమంచిలి మెప్మా కార్యాలయంలో నర్సీపట్నం, యలమంచిలి మున్సిపాలిటీల పరిధిలో రిసోర్సుపర్సన్లు, సీఎల్‌ఆర్పీలు, సీవోలకు ప్రొఫైలింగ్ యాప్‌పై నిర్వహించిన ఒకరోజు వర్క్ షాప్‌ను ఆమె ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు నేరుగా అందడానికి, ఎటువంటి అక్రమాలకు అవకాశం లేకుండా ఉండడానికి వివరాల నమోదు ప్రక్రియ ఎంతో కీలకమని ఆమె చెప్పారు. మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు పాల్గొన్నారు.

116 మద్యం బాటిళ్ల పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

బుచ్చెయ్యపేట: అక్రమంగా తరలిస్తున్న 116 మద్యం బాటిళ్లను చోడవరం ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. సోమవారం సీతయ్యపేట నుంచి రావికమతం మండలం తోటకూరపాలెం గ్రామం వైపు బైక్‌పై మద్యం తరలిస్తున్న లెక్కల రమణను అదుపులోకి తీసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ కె.వి.బాపునాయుడు తెలిపారు. రమణపై కేసు నమోదు చేసి అనకాపల్లి కోర్టుకు తరలించామన్నారు. బైక్, మద్యంను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ దాడిలో ఎస్ఐ హనుమంతు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక


సేల్స్ అండ్ సర్వీసెస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

అనకాపల్లి: అనకాపల్లి సేల్స్ అండ్ సర్వీసెస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వేగి అజయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణ మండపంలో సోమవారం అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. సంఘ గౌరవాధ్యక్షుడిగా శిలపరశెట్టి ప్రసాద్‌బాబు, కార్యదర్శిగా మహమ్మద్ ఆలీ, కోశాధికారిగా ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా వి.రాజేష్‌రావు, వి.గోపి, సహాయ కార్యదర్శులుగా ఎస్.పవన్‌రాజ్, జె.సంతోష్, కమిటీ సభ్యులుగా జి.నూకరాజు, ఎ.కుమార్, సాయి, హర్ష, శేషు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నేటి వరకూ 16 ఏళ్లుగా ఒకే అసోసియేషన్ సభ్యులు ఉండగా.. ఈ ఏడాది నుంచి రెండేళ్ల పాటు నూతన కార్యవర్గం ఉంటుందని గౌరవాధ్యక్షుడు ప్రసాద్‌బాబు తెలిపారు.

పేరుకుపోయిన చెత్త


కశింకోట ప్రాథమిక పాఠశాల ఎదుట పేరుకుపోయిన చెత్త కుప్ప

కశింకోట: కశింకోటలోని 6వ ప్రాథమిక పాఠశాల ఎదుట చెత్త కుప్ప పేరుకుపోయి అధ్వానంగా ఉంది. దీని నుంచి దుర్వాసన రావడంతో దారిన నడవలేక పోతున్నామని, అంటు వ్యాధులు వ్యాపించే అవకాశముందని స్థానిక అఫీషియల్ కాలనీ వాసులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సత్వరమే చెత్త తొలగింపునకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

10 మద్యం బ్యాటిళ్లతో వ్యక్తి అరెస్టు

అనకాపల్లి: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మండలంలో శంకరం గ్రామానికి చెందిన సన్యాసిరావు 10 మద్యం క్యాటర్ బాటిళ్లు తరలిస్తూ పట్టుపడ్డాడని పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

12 బీర్ సీసాలు స్వాధీనం

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెంలో విక్రయించడానికి తరలిస్తున్న 12 బీర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. జమాదులపాలేనికి చెందిన పక్కుర్తి సత్తిబాబు వీటిని తరలిస్తుండగా పట్టుకొని అరెస్టు చేశామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 2,162 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,100	4,610
మొదటి రకం	3,660	4,830
రెండో రకం	3,340	4,110
మూడో రకం	3,110	3,310

అనకాపల్లి సినిమాలు

దేవర	:రాజా
'క'	:సత్యనారాయణస్క్రీన్-1
అమరాన్	:సత్యనారాయణస్క్రీన్-2
వేట్టయాన్	:షిర్డిసాయి
జనక అయితే గనక	:పర్తిసాయి
బఘీర	:వెంకటేశ్వర
విశ్వం	:శ్రీసత్య
లక్కీభాస్కర్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 35 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5, బీ పాజిటివ్-16, ఓ పాజిటివ్-17, ఏబీ పాజిటివ్-1 యూనిట్ చొప్పున శుద్ధి చేసిన రక్తం అందుబాటులో ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్‌ను 97036 19706 నంబర్‌లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 386 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 364 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబర్‌లో సంప్రదించవచ్చు.

'మత్తు' వదిలిస్తున్నారు..!

- ఎన్టీఆర్ వైద్యాలయంలో వ్యసనపరులకు ప్రత్యేక చికిత్స
- అందుబాటులో 15 బెడ్లు, ఖరీదైన మందులు
- చెడు వ్యసనాలకు చెక్ పెట్టేలా వైద్య సేవలు

అనకాపల్లి: ఇటీవల కాలంలో చాలా మంది యువత చెడు వ్యసనాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. మాదక ద్రవ్యాలు, మద్యం మత్తులో నేరాలకు పాల్పడుతున్న ఘటనలు నిత్యం కనిపిస్తున్నాయి. మత్తు పదార్థాలు, ఆల్కహాల్‌కు బానిసలు కావడంతో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. ప్రధానంగా పేద, మధ్యతరగతి వర్గాల్లో ఈ దురలవాట్లు వారి జీవన విధానంపై ఎంతో దుష్ప్రభావం చూపుతోంది. ఒకవైపు ఆరోగ్యం పాడైపోతుండటమే కాకుండా చెడు వ్యసనాల కారణంగా ఆర్థిక ఇబ్బందులు, మత్తు కారణంగా అపస్మారక స్థితిలో వివిధ నేరాలకు పాల్పడే పరిస్థితులు తలెత్తాయి.

చెడు వ్యసనాల నుంచి 'విముక్తి'

చుట్ట, బీడీ, సిగరెట్, గంజాయి, డ్రగ్స్ మొదలగు మత్తు పదార్థాలతోపాటు మద్యపానం వంటి వ్యసనాల నుంచి దూరం అవ్వాలనుకునే వారి కోసం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో మత్తు వ్యసన విముక్తి విభాగాన్ని ఐదేళ్ల కిందట ఏర్పాటు చేశారు. ఇక్కడ చికిత్సతోపాటు ఉచితంగా మందులు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఖరీదైనవే అయినా ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని విధంగా మందులు అందజేస్తున్నారు. విభాగం ఏర్పాటు చేసినప్పటి నుంచి నేటి వరకూ వ్యసనపరులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. 2020లోనే ఈ మందులు అందుబాటులోకి వచ్చినప్పటికీ వాటి వల్ల ఎటువంటి ఇబ్బందులు వస్తాయోనని కొందరు, ధైర్యం చేయలేక మరి కొందరు వాడేందుకు విముఖత చూపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పలు అవగాహన కార్యక్రమాలతోపాటు వివిధ కారణాలతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరే వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా మందుల వినియోగానికి బాధితులు ముందుకొస్తున్నారు.


అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం

నికోటిన్ మందులు, కౌన్సెలింగ్

నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాంలో భాగంగా నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాం ద్వారా మాదక ద్రవ్యాల అలవాట్ల నియంత్రణకు నికోటిన్ మందులు ఉపయోగపడుతున్నాయి. డ్రగ్స్‌కు అలవాటు పడిన వారు ఎంతమేరకు వినియోగిస్తున్నారో తెలుసుకుని వారి ఆరోగ్య స్థితిని పరిశీలించి, వైద్యులు వివిధ పరిమితుల్లో మందులు అందజేస్తున్నారు. వీటిని రెండు రకాలుగా అందుబాటు లోకి తీసుకొచ్చారు. నికోటిన్ ప్యాచస్(స్టిక్కర్ రూపంలో) 7 ఎంజీ, 14 ఎంజీ, 21 ఎంజీ రూపంలో చేతి భుజానికి స్టిక్కర్ అతికించే విధానంలో వేస్తున్నారు. నికోటిన్ గమ్స్ రూపంలో పంటి కింద పెట్టుకునేలా 2 ఎంజీ, 4 ఎంజీ మోతాదులో అందిస్తున్నారు.


రోగితో మాట్లాడుతున్న వైద్యుడు కృష్ణచంద్ర

ఆల్కహాల్ బాధితులకు కూడా వారు మద్యం సేవించే పరిమితి, ఆరోగ్య స్థితిని బట్టి మందుల రూపంలో నెల నుంచి 3 నెలల కోర్సుగా మందులు వాడిస్తున్నారు. మాదక ద్రవ్యాలు, ఆల్కహాల్ మానేసేందుకు సిద్ధపడిన వారికి ఆస్పత్రుల్లో వైద్యులు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అందుబాటులోఉన్న నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాం ప్రతినిధులు ఆన్‌పేషెంట్లను కలిసి కౌన్సెలింగ్ తోపాటు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సేవా సంస్థల వద్ద సమావేశాలు నిర్వహించి మాదక ద్రవ్యాల నియంత్రణకు అవగాహన కల్పిస్తున్నారు.

ఉచితంగా అన్ని రకాల మందులు



ఆస్పత్రిలో మత్తు విభాగంలో ఒక వైద్యుడు, ముగ్గురు కౌన్సిలర్లతోపాటు ఐదుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. రోజుకు 25 నుంచి 30 మంది రోగులు వస్తున్నారు. అవసరమైన రోగులకు ప్రత్యేకంగా 15 బెడ్లు ఏర్పాటు చేశాం. ఆస్పత్రిలో అన్ని రకాల మందులు ఉచితంగా అందజేస్తున్నాం. యువత విలువైన జీవితాన్ని పాడుచేసుకోవద్దు.

– డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్, ఎన్టీఆర్ వైద్యాలయం

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం

పట్టణ, మండల పరిధిలోని ప్రాంతాల్లో మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. మాదక ద్రవ్యాలు, ఆల్కహాల్ బారిన పడిన వారి ఆరోగ్య స్థితి క్రమేపి క్షీణించే పరిస్థితి ఏర్పడుతోంది. తల్లిదండ్రులు విద్యార్థుల నడవడికపై ప్రత్యేక దృష్టి సారించాలి.

– క్రాంతికుమార్, మత్తు వ్యసన విముక్తి విభాగం కౌన్సిలర్

8 నుంచి ప్రజాపోరు


ప్రజాపోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి: అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 8 నుంచి 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పోరు పేరుతో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ప్రజాపోరు పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించి, విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 14న సచివాలయాల వద్ద, 15న మండల కార్యాలయాల వద్ద ధర్నాలు చేస్తామన్నారు. నిత్యావసర సరుకులు, వంటనూనెలు, కూరగాయల ధరలు ఆకాశనంటుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూస్తున్న యువత నిరాశ చెందారన్నారు. రాష్ట్రంలో మహిళలు, పిల్లలపై, దళితులపై అత్యాచారాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ హామీలు అమలులోకి కాలేదని, అవినీతి విచ్చలవిడిగా సాగుతోందని, ఇసుక, మద్యం మాఫియాలు చెలరేగిపోతున్నాయన్నారు. జిల్లాలోని పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పించాలని, రైతుల పంటలకు పెట్టుబడికి 50 శాతం అదనంగా కలిపి గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు తెలుగుదేశం పార్టీ మద్దతివ్వడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, జి.కోటేశ్వరరావు, డి.వెంకన్న, గంటా శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

క్లబ్ నిబంధనల ప్రకారమే గవర్నర్ పోస్టు ఇవ్వాలి


మాట్లాడుతున్న వాసవీ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ వెంకట మాధవ్

అనకాపల్లి: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్-2025 గవర్నర్ ఎన్నికలు ఏకపక్షంగా జరిగాయని, దీనిపై హైకోర్టులో కేసు వేశామని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వి2168 జిల్లా వైస్ గవర్నర్ సీనాథ్ వెంకట మాధవ్(మధు) తెలిపారు. స్థానిక గాంధీ కూరగాయల మార్కెట్ కిరాణా మర్చంట్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఆనవాయితీగా వైస్ గవర్నర్‌ను గవర్నర్‌గా ప్రకటించడం నేటి వరకూ జరిగిందన్నారు. ఈ ఏడాది జిల్లా గవర్నర్ పోటీకి అక్టోబర్ 13న అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో సీనాథ్ వెంకట మాధవ్, పసుపర్తి మల్లికార్జునరావు, కె.సోమరాజు, కె.పార్వతి ఎలియస్ పూర్ణిమలు పోటీలో ఉండగా.. ఎన్నికల పరిశీలనలో జిల్లా గవర్నర్ సీనాద్ శ్రీను పోటీలో ఉన్న కె.సోమరాజు విత్‌డ్రా అవడం జరిగిందని చెప్పారు. క్లబ్ వైస్ చాన్స్‌లర్ ఎ.వెంకటేష్ నిబంధనలకు విరుద్ధంగా వైస్ గవర్నర్‌గా పనిచేసిన వ్యక్తికి జిల్లా గవర్నర్ పోస్టు ఇవ్వకుండా కె.పార్వతి(పూర్ణిమ)కు ఇవ్వడం అన్యాయమన్నారు. దీనిపై ఈ నెల 2న హైదరాబాద్ హైకోర్టులో కేసు వేశామన్నారు. జిల్లాలోని వివిధ క్లబ్‌ల్లో 4,300 మంది సభ్యులు ఉన్నారని, క్లబ్ ఉన్నతాధికారులు జిల్లా గవర్నర్ పోస్టుకు సభ్యులతో ఎన్నికలు నిర్వహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యులు తమ్మిన సుబ్రహ్మణ్యం గుప్తా, ఎన్.ప్రసాద్, వి.మల్లేశ్వరరావు, జి.ఆర్.ఎల్.నారాయణ, పి.భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట సంతకు నాగులచవితి శోభ


నాగులచవితి పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు


నాగుల తువ్వాళ్లు కొంటున్న మహిళలు

కశింకోట: కశింకోట సంత సోమవారం నాగులచవితి శోభను సంతరించుకుంది. మంగళవారం నాగులచవితి పర్వదినం కావడంతో కొనుగోలుదారులతో సంత కళకళలాడింది. చవితి ఉత్సవ పూజల్లో సంప్రదాయంగా వినియోగించే తాటి గుజ్జు, నాగుల తువ్వాళ్లు, గోరింత, తులసీ పత్రి, పండ్లు, పూలు వగైరా అమ్మకాలు జోరుగా సాగాయి. చిమ్మిలి కోసం వినియోగించే నువ్వు పప్పు, కోడిగుడ్లు, బాణసంచా అమ్మకాలతో దుకాణాలు కిక్కిరిశాయి.

గాడి వీధిలో నేడు నాగులచవితి వేడుకలు

కశింకోట: కశింకోట గాడి వీధిలో వెలసిన నాగేంద్ర స్వామి ఆలయంలో మంగవారం నాగులచవితి వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. స్థానికులతోపాటు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు వచ్చి నాగేంద్రుడిని దర్శించి చీరలు, రవికెలు, అరటి గెలలు, తల నీలాల రూపంలో స్వామి వారికి సమర్పించుకుంటారు. సంప్రదాయంగా ఆలయంలో ఉన్న పుట్ట కలుగులో బెల్లం, నువ్వుపప్పుతో తయారు చేసిన చిమ్మిలి, కోడిగుడ్లు, పాలు, తాటి గుంజు వేసి పూజలు చేస్తారు. రైతులు ఎక్కువగా కార్యక్రమంలో పాల్గొంటారు. నాగుల చవితి సందర్భంగా కోలాటాలు, చెట్టు భజనలు మొదలగు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాకులు తెలిపారు.

నేత్రపర్వం.. వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం


స్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కశింకోట: కశింకోటలోని కోనేరు వద్ద వెలసిన మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద మంత్రాల నడుమ వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మ దంపతుల కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా జరిపించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. రాత్రి స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో డప్పులు, వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. వీరబ్రహ్మేంద్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నేత్రపర్వంగా జరిగింది.

ఆసక్తిని పెంచేలా గణిత బోధన


వెదురుపర్తి హైస్కూల్‌లో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు


గణిత భావనలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కశింకోట: మండలంలోని వెదురుపర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. గణిత మేధావి శకుంతలా దేవి జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్కూల్ హెచ్‌ఎం జి.వి.కె.ఆచారి మాట్లాడుతూ పిల్లలకు ఒత్తిడి లేకుండా గణితం బోధించడం వల్ల వారిలో భయం పోయి ఆసక్తి పెరుగుతుందన్నారు. గణిత ఉపాధ్యాయుడు ఎ.వి.ఎస్.మూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు శకుంతలా దేవి జయంతి వారోత్సవాల సందర్భంగా క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు, ఆటలు, పాటలు, నాటికల ద్వారా గణిత బోధన, నమూనాలు తయారు చేసి వివరించడంలో పోటీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా పోటీల విజేతలకు హెచ్‌ఎం బహుమతులు అందజేశారు. విద్యార్థులు తయారు చేసిన గణిత భావనల చార్టులు, నమూనాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై.విజయ్, సోమరాజు, సవిత లక్ష్మి, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాల రక్షణపై అవగాహన


వరి పొలాల్లో తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

తుమ్మపాల: వరిలో పురుగుల ఉధృతి ఎక్కువగా ఉందని, ఎకరాకు 20 వేల ట్రైకోగామా గుడ్లను వదిలి పెట్టడం ద్వారా పంటను ఆశించిన చీడపీడలను నివారించవచ్చని గ్రామ వ్యవసాయ సహాయకులు జ్యోతి మోహన్ అన్నారు. ట్రైకోగామ గుడ్ల నుంచి వచ్చే పరాన్నా జీవి వరిని ఆశించే చీడపీడ పురుగుల గుడ్ల లార్వాలను నాశనం చేస్తుందని అవగాహన కల్పించారు. మండలంలోని సీతానగరంలో వరి పొలాలను సోమవారం పరిశీలించిన ఆమె.. రైతులకు పలు సూచనలిచ్చారు. పురుగుల నివారణపై తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు డెమో నిర్వహించారు. ప్రస్తుతం వరిలో పొడతెగులు ఎక్కువగా ఆశించే అవకాశముందని, ప్రోపీ కొనజోల్ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవడం ద్వారా దాని నుంచి వరి పొలాలను రక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు పొలమర శెట్టి శివ, అప్పారావు, సుధా కృష్ణవేణి పాల్గొన్నారు.

నాగ దుర్గమ్మ జాతర నేడు


ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డు ఆవరణలో అమ్మవారి ఆలయం, (ఇన్‌సెట్‌లో) నాగ దుర్గమ్మ

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ ఆవరణలో వెలసిన నాగదుర్గమ్మ జాతర మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ చైర్మన్ భీశెట్టి తాతారావు, సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 2000 సంవత్సరంలో మార్కెట్ యార్డును పొక్లెయిన్ సహాయంతో చదును చేస్తుండగా.. నాగదేవత పుట్టలు వేయడంతో గవరపాలెం ప్రాంతానికి చెందిన దత్తత్రయుడు, సత్యవతి దంపతులు వచ్చి నిత్యం పాలు పోసేవారన్నారు. ఎన్నిసార్లు భూమిని చదును చేసినా మళ్లీ మళ్లీ పుట్టలు రావడంతో దత్తత్రయుడు దంపతులు ఇక్కడ చిన్న పాటి గుడి నిర్మించాలనుకున్నారని చెప్పారు. అదే ఏడాది జూన్ 16 నుంచి దశల వారీగా అభివృద్ధి చేసుకుంటూ పూర్తిస్థాయిలో ఆలయాన్ని నిర్మించినట్లు తెలిపారు. నాటి నుంచి ప్రతి రోజూ నాగదుర్గమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తూ.. నాగులచవితి రోజున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. సంతానం లేని దంపతులు తొమ్మిది గురువారాలు క్రమం తప్పకుండా పూజలు చేస్తే సంతానం కలుగుతుందన్నారు.

జాతర కార్యక్రమాలు..

మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి నేల వేషాలు, రాత్రికి స్టేజ్ కార్యక్రమాలు జరుగుతాయి.

హర హర మహాదేవ

- భక్తిశ్రద్ధలతో కార్తీక మాసం మొదటి సోమవారం పూజలు
- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు


కశింకోట శివాలయంలో బారులు తీరిన భక్తులు


కాశీవిశ్వేశ్వరాలయ ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు


కశింకోట శివాలయంలో అభిషేకాలు చేస్తున్న అర్చకులు


వేల్పులవీధి కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయలో శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు


సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు


భక్తులకు ప్రసాదం అందిస్తున్న బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు


సాధువుల గుడి వద్ద శివుడికి అభిషేకం చేస్తున్న భక్తులు

అనకాపల్లి: పట్టణ, మండలం పరిధిలోని శివాలయాలు హర హర మహాదేవ నామస్మరణతో మార్మోగాయి. కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా శైవక్షేత్రాల్లో వేకువజాము 4 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్వామికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేల్పుల వీధి కాశీవిశ్వేశ్వరస్వామి, మెయిన్ రోడ్డులోని సిద్ధిలింగేశ్వరస్వామి, కూరగాయల మార్కెట్ వద్ద సాధువుల గుడి, గవరపాలెం భోగలింగేశ్వర స్వామి ఆలయం, శారదా నది ఒడ్డున ఉమారామ లింగేశ్వరస్వామి, చిన్నరాజుపేటలో సాంబశివుని ఆలయాలు, మండలంలోని అక్కిరెడ్డిపాలెం పంచాయతీ శీరంశెట్టిపాలెం, మామిడిపాలెం, కూంద్రం, తగరంపూడి, బవులవాడ తదితర ప్రాంతాల్లో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. కొబ్బరి కాయలు, వీభూది, నేరేడు, పాలు, పెరుగు, వివిధ రకాలైన పండ్ల రసాలతో శివలింగానికి అభిషేకాలు ఆలయాల అర్చకులు నిర్వహించారు. ఆలయాల ధ్వజ స్తంభాల వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. ఆలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈవోలు, ప్రైవేట్ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రధాన దేవాలయాల వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ

గవరపాలెం భోగలింగేశ్వరస్వామి ఆలయంలో బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవాధ్యక్షుడు పెంటకోట నర్సింగరావు, చైర్మన్ పి.ఎస్.అప్పారావు, అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె.జోగినాయుడు, కార్యదర్శి పెంటకోట ప్రభాకర్, కోశాధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

కశింకోట: మండలంలోని శివ, శైవ దేవాలయాలు కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా భక్తులతో కిక్కిరిశాయి. వేకువజాము నుంచి ఆలయాలను దర్శించి పూజలు చేశారు. కశింకోట పురాతన శివాలయంలో భక్తులు ప్రత్యేక అభిషేకాలు, దర్శనాలు చేసుకున్నారు. ఆలయ అర్చకులు వి. చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

– కస్పా వీధి సాంబశివుని ఆలయంలో అర్చకుడు వేయిదళముల ప్రసాద్ ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. గవరపేట, డీపీఎన్ హైస్కూల్, వెలంపేటల వద్ద ఆలయాల్లో నెలకొల్పిన గౌరీ పరమేశ్వరులను మహిళా భక్తులు శారదా నదిలో స్నానాలు ఆచరించి దర్శించారు.

➡ గవరపేట వేంకటేశ్వరస్వామి ఆలయం, లక్ష్మీనృసింహస్వామి ఆలయం, ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయాలు, కోనేరు వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి, కామాక్షి సమేత శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భారీ అన్నసమారాధనలు నిర్వహించారు.

➡ మండలంలోని వెదురుపర్తి రామలింగేశ్వరస్వామి స్వయంభూ ఆలయం, బయ్యవరం, తేగాడ, పేరంటాలపాలెం, నూతలగుంటపాలెం, చింతలపాలెం, సోమవరం, కన్నూరు పాలెం గ్రామాల్లోని శివాలయాలు, ఉగ్గిన పాలెం ఉమా సోమేశ్వరస్వామి ఆలయం, ఏఎస్ పేటలోని సాంబశివుని ఆలయం, తాళ్ల పాలెం రామలింగేశ్వరస్వామి, బంగారయ్యపేట బసవేశ్వరస్వామి, సాంబమూర్తి ఆలయాల్లో కార్తీక సోమవారం పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు శివయ్యను దర్శించుకున్నారు.